క్లుప్తంగా

ఘనంగా కలశ పూజ



నందిగామ: పట్టణంలోని కృష్ణ బలిజ నగర్‌లో నూతనంగా నిర్మించిన శివనాగేంద్ర స్వామి ఆలయంలో ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయంలో ప్రతిష్ఠించబోయే శివ నాగేంద్ర స్వామి, గణపతి, కుమారస్వామి, ఆదిశేషువు, నందీశ్వర సమేత శివలింగము, పరివారల దేవతల విగ్రహాలను పట్టణంలో మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. పలు రకాల హోమాలు, కలస పూజ, క్షీరాధివాసం, ధాన్యాధివాసం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనుల పండువగా సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం



నందిగామ: మండలంలోని దాములూరు కూడలిలో వైరా నది ఒడ్డున సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కృత్తికా నక్షత్రం నేపథ్యంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకాల అనంతరం వేద పండితుడు దాములూరి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



పెనుగంచిప్రోలు: గ్రామానికి చెందిన గుంజి తిరుపతిరావు మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. శనివారం గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను స్వయంగా తిరుపతిరావు దుకాణం వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.55 వేల చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, కెడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, నాయకులు గుంజి లక్ష్మణరావు, రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బాసట

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వాంబేకాలనీకి చెందిన పులకరం శివకుమార్ కుటుంబానికి నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సేనాపతి శ్రీనివాస్ బాసటగా నిలిచారు. వారి కుటుంబ స్థితిని తెలుసుకున్న ఆయన వారికి నెలవారీ సరుకులు, 50 కేజీల బియ్యం, రూ.5 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ నిరుపేద కుటుంబానికి ఎస్సై చేసిన సాయాన్ని తెలుసుకున్న నార్త్ జోన్ ఏసీపీ రవికాంత్, సీఐ కె.శ్రీనివాస్ ఆయన్ను అభినందించారు.

దాతల సహకారం మరువలేనిది



మధురానగర్(విజయవాడసెంట్రల్): దాతల సహ కారం మరువలేనిదని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు వసంత కుమార్ తెలిపారు. దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు శనివారం సాయంత్రం సత్కారం జరిగింది. వసంతకుమార్ మాట్లాడుతూ వాంబేకాలనీకు చెందిన మాతృదేవో భవ వృద్ధాశ్రమానికి రూ. 35వేల వ్యయంతో షెడ్డును నిర్మించి అన్నదానానికి సహకరించిన దాతలను సత్కరించుకోవటం ఆనందంగా ఉందన్నారు.సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడు మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు, దాతలను సత్కరించారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కె.రాము, కె. వరప్రసాద్, ఏడుకొండలు, వీరంకి గోకర్ణేశ్వరరావు, మండ రాము, ఫణి మిత్ర బృందం పాల్గొన్నారు.

25న ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మహాసభ

మైలవరం: ఉమ్మడి కృష్ణా జిల్లాల ఎమ్మార్పీఎస్ మహాసభ మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలో ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆ సంఘ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంకొల్లు జమలయ్య శనివారం తెలిపారు. ఈ మహాసభకు మందా కృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి మహాసభకు అధిక సంఖ్యలో అభిమానులు హాజరువాలని కోరారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను
- పెనుగంచిప్రోలు మండల సర్వసభ్య సమావేశం
- వలంటీర్లకు సత్కారం



మాట్లాడుతున్న విప్ ఉదయభాను, పక్కన తన్నీరు, ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి

పెనుగంచిప్రోలు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను, అవసరాలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ తాగునీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాలపై అధికారులు తక్షణం శ్రద్ధ పెట్టి పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో మినీ పార్కులు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు దాతలు, ఎన్‌ఆర్ఐల సహకారం తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి అర్హులైన మరో లబ్ధిదారులకు కేటాయించాలని తహసీల్దార్ కే లక్ష్మీకల్యాణిని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమం కింద మౌలిక వసతులు సమకూరుస్తోందని, ప్రభుత్వ బడులను ప్రోత్సాహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యులకు, సిబ్బందికి మధ్య సమన్వయం లేదన్నారు. ఫిర్యాదులు వస్తే సహించమని హెచ్చరించారు. సచివాలయాలు, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలు వేగంగా జరగాలన్నారు. కల్వర్టుల నిర్మాణం, తాగునీటి సమస్యల పరికారానికి తీర్మానాలు చేశారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ వూట్ల నాగమణి, మైనింగ్, పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ జాన్‌మియా, పీఆర్, విద్యుత్, హౌసింగ్ ఏఈలు సుందరరామయ్య, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, వైద్యాధికారి ఇందిర, ఎంఈఓ రవీంద్ర, పశు వైద్యాధికారి అనిల్, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, ఏపీఓ తిరుపతయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. శనివారం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అనిగండ్లపాడు గ్రామానికి చెందిన ఉండెమొదలు శమంతకమణికి రూ.70 వేలు, లింగగూడెం గ్రామానికి చెందిన కొత్తా లక్ష్మీకి రూ.1.20 లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీ సభ్యులు దోసపాటి స్వర్ణ లత, బరిగెల వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్ మియా, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం..

అవార్డులు పొందిన వలంటీర్లను ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పెనుగంచిప్రోలు–3 సచివాలయం నుంచి సేవ వజ్ర అవార్డు తీసుకున్న కొమ్మినేని సందీప్‌తో పాటు షేక్ సలీమా, సేవా రత్న అవార్డులు పొందిన బలుగూరి శ్రీలత, షేక్ నాగుల్‌మీరా, మేడ నాగేశ్వరరావు, జక్కులూరి రాజు, మీసాల నరసింహారావులను ఆయన ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ఫలాలను పేదలకు చేర్చే గొప్ప అవకాశాన్ని వలంటీర్లకు కల్పించటం గొప్ప నిర్ణయమన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం



వర్షం సమయంలో మెరుస్తున్న ఆకాశం

నందిగామ: నందిగామ ప్రాంతంలో శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ప్రజలు సూర్య ప్రతాపానికి విలవిలలాడిపోయారు. ఈ తరుణంలో రాత్రి సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాత్రి పొద్దుపోయే వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- వీ అన్నవరంలో గడప గడపకు మన ప్రభుత్వం



వీ అన్నవరం గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

వీరులపాడు (కంచికచర్ల): కులం, మతం పార్టీలు చూడకుండా అర్హత గల ప్రతి ఒక్కరికీ ఇళ్లు, ఇళ్లస్థలం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. వీరులపాడు మండలం వీ అన్నవరం గ్రామంలో ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శనివారం ఉదయం, సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగితెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం జగన్ ప్రభుత్వమన్నారు. ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని పరిష్కరించాలని మహిళలు కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలోని ప్రజలందరికీ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎంపీపీ కోటేరు శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు అమర్లపూడి కీర్తి సౌజన్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుల రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ షహనాజ్‌బేగం, సర్పంచి జే వరబాబు, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు, జే శేషగిరి రావు, రాంబాబు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యర్థ వస్తువుల సేకరణ కేంద్రాలు ప్రారంభం



ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను (వ్యర్థ వస్తువుల సేకరణ కేంద్రాలను) ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. శనివారం స్థానిక 6వ సచివాలయంలో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీ సైకిల్, రీ యూజ్ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీల్లో 'మేరా లైఫ్.. మేరా స్వచ్ఛనగర్' కార్యక్రమం జూన్ 4వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో సచివాలయాల వద్ద ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు పనిచేస్తాయని తెలిపారు. తమ గృహాల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్ షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగ్‌లు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్లు, చెక్క కుర్చీలు, ఇనుప కుర్చీలు, టేబుల్స్, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర వస్తువులను ఈ సెంటర్‌లో అందిస్తే అవసరం ఉన్న ఇతరులకు వాటిని అందజేస్తారని తెలిపారు. వస్తువులు ఇవ్వదలచిన వారు తమ ఏరియాలోని సచివాలయ శానిటేషన్ సెక్రటరీ, వలంటీర్లకు సమాచారం ఇస్తే వారు ఆయా వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు తరలిస్తారని తెలిపారు. ఇలాంటి సేవా అవకాశం కల్పిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సేవలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్. మల్లేశ్వరరావు, కౌన్సిలర్ వట్టెం మనోహర్, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, చిరంజీవి, నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక 2వ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్ ప్రారంభించారు.

దాసాంజనేయుడికి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభు శ్రీదాసాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడం స్కూళ్లు, కళాశాలలకు సెలవులు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఈఓ నాగినేని భవాని, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

26 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి శనివారం ఆలయ అర్చకులు అంగలూరి రంగాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 28 వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు సుప్రభాతసేవతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, విశేషంగా లోకకల్యాణార్థం హోమాలు ఏర్పాటు చేశామన్నారు. 28వ తేదీ ఆదివారం శ్రీదేవి భూదేవి శిలాబింబముల ప్రతిష్ట, స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

2న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తిరువూరు: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి జూన్ 2న ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజరు వేణు తెలిపారు. 2న సాయంత్రం 5 గంటలకు తిరువూరులో బయల్దేరి 3వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి చేరుతుందని పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాసమంగాపురం, కాణిపాకం, శ్రీపురంల మీదుగా 4వ తేదీ మధ్యాహ్నం అరుణాచలం చేరుతుందని తెలిపారు. టికెట్ ధర రానుపోను రూ. 2800గా నిర్ణయించామని పేర్కొన్నారు. ఆన్‌లైన్లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 98856 61835లో సంప్రదించాలని పేర్కొన్నారు.

22న వలంటీర్లకు సత్కారం

నూజివీడు: మండలం, పట్టణంలోని వలంటీర్లకు ఈనెల 22న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లను సత్కరించడంతోపాటు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర నగదు ప్రోత్సహకాలను అందజేయనున్నట్లు ఎంపీడీవో ఎల్ అలీఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని నగదు ప్రోత్సాహకాలను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మండలంలోని, పట్టణంలోని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలో సేవా వజ్ర పురస్కారానికి దిగవల్లికి చెందిన కెత్తే సాయి లోహిత, సేవా రత్న పురస్కారానికి పల్లెర్లమూడికి చెందిన తాళం జీవన్ కుమార్, సిలారపు ఉష, పోలసానపల్లికి చెందిన పులపాక అనిల్, అన్నవరానికి చెందిన మరీదు లక్ష్మి, గొల్లపల్లికి చెందిన నామాల గణేష్ ఎంపికయ్యారు. మిగిలిన వారందరూ సేవా మిత్రకు ఎంపికైనట్లు ఎంపీడీఓ ఎల్ అలీఖాన్ ఈ సందర్భంగా వివరాలు వెల్లడించారు.

మెడిటేషన్ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్రరావు, తహసీల్దార్ నాగరాజు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణాన్ని జిల్లాలోనే మేటి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చేస్తున్న కృషిలో భాగంగా పట్టణంలో పలు నిర్మాణాలకు అనువైన స్థలాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక ఊర చెరువుకు ఆనుకుని ఉన్న ధనంబోడుపై ఉన్న బౌద్ధ స్థూపం ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న 4.3 ఎకరాల స్థలంలో మెడిటేషన్ హాల్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని ఆర్డీఓ పరిశీలించారు. పట్టణంలోని చిల్లకల్లు రోడ్‌లో కృష్ణుడి గుడి వద్ద ఉన్న ఎకరం స్థలంలో త్రీ స్టార్ హోటర్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు, ఆర్‌ఐ యు.ఆనంద్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు



పుస్తక పఠనంలో విద్యార్థులు

కంచికచర్ల : వేసవి విరామాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ ముందుగా ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ముందుగా టంగుటూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవి నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పించారు. యోగా గురువు నారాయణ విద్యార్థులకు యోగా నేర్పారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

అనిగండ్లపాడు (పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతికథలు చెప్పారు. పుస్తక పఠనం వలన కలిగే లాభాలను వివరించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఇంజం మధు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయుడు టి.ప్రసాద్‌బాబు పుస్తకాలు చదవడం వలన వారి జీవితాలకు ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.నాగేశ్వరరావు, వినోద్‌కుమార్, చంద్రశేఖర్, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది సత్యావతి పాల్గొన్నారు.

సిరివెన్నెలకు స్వరాంజలి



సిరివెన్నెల సీతారామశాస్త్రి సినీ జీవిత విశేషాలు వివరిస్తున్న ఆశయ్య, వేదికపై రసూల్ బాబు తదితరులు

విజయవాడ కల్చరల్: సినీ గేయ రచయిత, కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి సందర్భంగా మోహన్ కృష్ణా ఆర్ట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సిరివెన్నెలకు అమర గాయకులకు స్వరాంజలి, తెలుగు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆ సంస్థ కార్యదర్శి బి.ఆశయ్య సిరివెన్నెల సీతారామ శాస్త్రి సినీరంగ సేవలను వివరించారు. సినీ సాహిత్యంలో సిరివెన్నెలు కురిపించిన రచయిత సీతారామ శాస్త్రి అని తెలిపారు. తెలుగు సినిమాలకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి సిరివెన్నెలగా అభివర్ణించారు. మోహన్ కృష్ణా ఆర్ట్స్ అధ్యక్షురాలు బి.లక్ష్మీబాయి, కోశాధికారి మోహన్ కృష్ణానాయక్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. ఆశయ్య ఆధ్వర్యంలో కృష్ణకుమారి, సువర్ణలక్ష్మి, శివనాగలక్ష్మి రూపశ్రీ, కృష్ణ సింధూ, రైల్వే శ్రీనివాస్. షేక్ రసూల్‌బాబు. రామశంకరావు పలు చిత్ర గీతాలను ఆలపించారు.

షేడ్ నెట్ నర్సరీల్లో నిబంధనలు పాటించాలి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ

నందిగామ: షేడ్ నెట్ నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.బాలాజీ కుమార్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం డివిజన్ పరిధిలోని షేడ్ నెట్ నర్సరీల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా షేడ్ నెట్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. షేడ్ నెట్ నర్సరీల్లో మిరప నారు పెంచే వారు తప్పనిసరిగా నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రైతులకు నాణ్యమైన నారును అందించాలని సూచించారు. రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా లైసెన్సు ఉండాలన్నారు. అనుమతులు లేకుండా నారు పెంచితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రమణమూర్తి, స్థానిక ఉద్యానవన శాఖ అధికారిని నీలిమ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వైజ్ఞానిక స్పృహతో సామాజిక అవగాహన



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దేవరాజు మహారాజు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైజ్ఞానిక స్పృహ ఉన్నవారే సామాజిక అవగాహనతో సాగుతారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు అన్నారు. మానవాళి ప్రయోజనాల కోసం సాగించే పరిశోధనలు విస్తృతం కావాలన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రం ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపీ పి.మధు అధ్యక్షతన నిత్య జీవితంలో వైజ్ఞానిక స్పృహ అనే అంశంపై సభ నిర్వహించారు. దేవరాజు మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలకు వర్తమానంలో ప్రాధాన్యం దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల సాయంతో ఉన్నత విద్యా సంస్థలు నడుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడం విచారకరమన్నారు. దేవాలయాల్లో కూడా సైన్స్ ఆధారంగానే కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని కూడా తప్పుబట్టిన సమాజం ఒకనాడు ఉండేదన్నారు. కార్పొరేట్ విద్య కారణంగా పిల్లల్లో ప్రశ్నించే తత్వం తగ్గుతోందన్నారు. నిచ్చెనమెట్ల వ్యవస్థ కొనసాగుతున్న దేశంలో వైజ్ఞానిక స్పృహ అవసరం ఎక్కువగా ఉందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో మానవత్వాన్ని తుంచేసే శక్తులపై ప్రజలను అప్రమత్తం చేసిన ప్రజాసంఘాల పాత్ర గుర్తించాలన్నారు. సామూహిక చైతన్యం పెంచడం ప్రజా సంఘాలుగా ఆలోచించాలన్నారు. అమరావతి బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు, ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, ఇన్‌చార్జి బి.ఆర్.తులసీరావు, టి.క్రాంతికిరణ్, యు.వి. రామరాజు, పాగోలు రాజు, కె.స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు జాగ్రత్తలు పాటించండి

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు వేసవిలో తగిన జాగ్రత్తలు పాటించాలని డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం కోరారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండేందుకు అప్పుడప్పుడు ఓఆర్ఎస్ పౌడర్ కలిపిన నీటిని తాగాలన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అందజేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు శనివారం ఆయన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఆర్ఎస్ నీటితో పాటు కొబ్బరినీరు, మజ్జిగ తరుచుగా తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలి

తిరువూరు: వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని తిరువూరు అమరావతి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు కావ్య సూచించారు. శనివారం ఆస్పత్రిలో వడదెబ్బ తీవ్రత, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అవసరమైతేనే ఎండలో బయటికి వెళ్లాలన్నారు. గొడుగు లేదా తలపై ఆచ్ఛాదనంతో మాత్రమే ఎండలో వెళ్లాని సూచించారు. నీరసం, కాళ్లు, చేతులు, తలనొప్పి, ఒకేసారి శరీర ఉష్ణోగ్రత పెరగడం, దాహం వేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ తగిలినట్లు గుర్తించాలన్నారు. వెంటనే ఆస్పత్రిలో చేరి వైద్యచికిత్స పొందాలని కోరారు. డాక్టర్ సాదిక్, డాక్టర్ ధరణేంద్ర తదితరులు పాల్గొన్నారు.